# ఆ ఒక్క రాత్రి చాలు

మూర్తి ఉత్సాహంగా ఇంటి ముఖం పట్టాడు. అతనిలో ఈ రోజు ఉత్సాహం ఒక్కసారిగా పాలపొంగులా వచ్చింది కాదు. నిన్నటి రోజు అంకురార్పణమైన ఆనందం నెమ్మదిగా వరద గోదావరిలా పెరుగుతూ ఈనాడు కట్టలు తెంచే వరదై అతన్ని ముంచివేస్తోంది. అతని ఆలోచనలు ఉత్సాహవంతమైన ఊహలతో పరవళ్ళు తొక్కుతున్నాయి. అతని శరీరంలో పునర్యవ్వనం ప్రాప్తించినట్లు గగుర్పాటుగా వుంది. కొత్త కొత్త కోర్కెలు అతని ఊపిరిని ఇబ్బంది పెడుతున్నాయి.

మూర్తికి నలభై అయిదు నిన్నగాక మొన్న నిండాయి. పాశ్చాత్య దేశాలలో అయితే  అతనిది పెళ్ళి యీడే - కానీ  ఈ దేశంలో మాత్రం అవాంఛనీయమైన వార్ధక్యం మీద వేసుకొని ముసలి కబుర్లు చెప్పటం ఆ వయసుకే ఆచారం. సంప్రదాయం అయితే ఆచారాలూ, సాంప్రదాయాలు మనుషులు నిర్మించుకున్న ఇనుపచట్రాలైతే - శరీరం, మనసు, కోరిక- ఇవి ప్రకృతి ప్రసాదించిన వరాలు.

మూర్తి నెల్లాళ్ళ క్రితం ఇరవై రెండేళ్ళ కూతురు శైలజ పెళ్ళి చేశాడు. అదీ ఎంతో ఆర్భాటంగా, ఎంతో అపురూపంగా తన కన్న కూతురు అత్తవారింట్లో ఏ ఒక్క హంగు కోసం, అవసరం కోసం తడుముకోకూడదనే భావంతో శక్తికిమించి డబ్బు సమకూర్చి పెళ్ళిచేశాడు. కారణం - తను పెళ్ళయిన కొత్తలో సత్తు గిన్నెలతో, తుంగచాపలతో, సంసారం ప్రారంభించడమే.

కూతురు పెళ్ళి చేశాక ఎంతో స్వేచ్ఛ, తృప్తి అనుభవిస్తున్నాడు మూర్తి. ఇంక వున్న ఒక్కగానొక్క కొడుకు శ్యాం. మగపిల్లవాడు. వాడితో సమస్యేం లేదు. వాడు నిన్ననే కాలేజీ వాళ్ళతో ఎక్స్‌కర్షన్‌కి వెళ్ళాడు.

ఇప్పుడిప్పుడే పెళ్ళి శ్రమ తీరింది. అతనిలో కొత్త ఊహ చోటు చేసుకుంది. అదీ. తను యిక ముందు అత్యంత రసవత్తరమైన జీవితం మొదలుపెట్టాలి అని. ఇన్నాళ్ళకి, ఇన్నేళ్ళకి తామిద్దరికీ దొరికిన ఏకాంతం పరిపూర్ణంగా వినియోగించుకోవాలి.

ఆ క్రితం రోజు మూర్తి యింటికి వియ్యంకుడి బావమరిది వచ్చాడు. ఆయన రావడం అదే మొదలు అసలు పరిచయం లేకపోయినా, చుట్టరికాన్ని పురస్కరించుకొని వచ్చాడాయన. ఆ పెద్దమనిషికి కాఫీ అందిస్తున్న సీతని చూసి "ఎవరీమె" అని ఆయనడగడం మా 'ఆవిడ సీత' అని తను చెప్పడం క్షణంలో జరిగిపోయింది. నిజమే మరి సీతకి పెళ్ళి చేసేంత కూతురుందంటే ఎవ్వరూ నమ్మరు.

సీత ఎంతో అందమైంది సన్నగా, తెల్లగా, హుందాగా వుంటుంది. విశాలమైన కళ్ళు చక్కని సూటైన ముక్కు ముత్యాల్లాంటి పలువరుస, అమాయకమైన ముఖం, చూసే ఎవరినైనా యిట్టే ఆకర్షిస్తుంది. ముప్పై ఎనిమిదేళ్ళ సీత నలగని కొత్త రూపాయి నోటులా వుంటుందంటే అతిశయోక్తి కాదు.

నిన్న ఆ పెద్దమనిషి కళ్ళల్లో కనిపించిన మెచ్చుకోలు మూర్తి గుండెల్లో యింతై, యింతింతై వెన్నెల వాగులైంది.

"సీతా! నువ్వెంత బాగుంటావో తెలుసా" అన్నాడు.

ఆ మాటలు విని సీత ఎగతాళి చెయ్యలేదు. మనోహరంగా నవ్వింది. "ఇన్నాళ్ళకి నా అందం తీరిగ్గా చూసే ధ్యాస పడిందా" అంది వయ్యారంగా.

ఆ మాత్రపు ప్రోత్సాహానికే మూర్తిలోని పురుష హృదయం పొంగి పొరలి పోయింది. వెంటనే భార్య చెవిలో-

"నీకో రహస్యం చెప్పనా" అన్నాడు.

సీత మళ్ళీ నవ్వింది. "నాకేం మీరు చెప్పనవసరం లేదు. నాకే తెలుసు" అంది.

"ఏమిటి?" అన్నాడు ఆత్రుతగా.

"రేపు మన పెళ్ళిరోజు" అంది తేలికగా.

మూర్తి సీతని గట్టిగా కౌగలించుకొని -

"నాదొక్క కోరిక" అన్నాడు.

"ఏమిటి" అంది.

"రేపు మనం చాలా బాగా సెలబ్రేట్ చేసుకోవాలి" అన్నాడు.

సీతేం మాట్లాడలేదు. ఆమె ముఖంలో ముచ్చటేసే సిగ్గు మురిపెంగా మెరిసింది.

❖ ❖ ❖

సీత మనస్సు కొత్త ఊపిరి పోసుకుంది. లేచింది మొదలు ఏదో తెలియని నూతనోత్సాహంతో పనిచేసుకుపోతోంది. అంతరంగం స్మృతి రంగస్థలమై గతం ఆమెకి ఘట్టాలు ఘట్టాలుగా కదలడం మొదలైంది.

పెళ్ళి అయిన మర్నాడు కార్యం అన్నారు. అప్పుడే అత్తగారు తగాదా పెట్టింది. దానికి తన తండ్రి రెచ్చిపోయి నానా అరుపులూ అరిచాడు. అటు వాళ్ళూ, ఇటు వాళ్ళూ బిగుసుకుపోయారు. తను మధ్య ఇరుక్కుపోయింది. బంధువులు కలుగజేసుకుని ఆ రోజు కార్యక్రమం జరిపించారు.

ఆ రోజు అదే మొదటిరాత్రి. గదిలో తనెంత ఏడ్చింది? భయంతో, అవమానంతో, దుఃఖంతో తల్లడిల్లిపోయిందనే గానీ ఆనందమంటే ఎరుగదు. అయితే ఆ రోజు మూర్తి ఎంతో పెద్ద మనసుతో తనని ఓదార్చాడు. ధైర్యం చెప్పాడు –

"ఇదిగో చూడు సీతా! పెద్దవాళ్ళ గొడవలు పెద్ద వాళ్ళతోనే ఉండనీ – మన మధ్య వాటి ప్రసక్తి వద్దు" అంటూ స్నేహం పంచి యిచ్చాడు. ఆ చిన్న వయస్సులో శృంగారమంటే ఏమిటో అవగాహన లేదుగానీ, ఆనాడు అతని సాన్నిధ్యంలో ఎంతో ఊరట పొందింది. ధైర్యాన్ని కూడదీసుకుంది.

ఆ తరువాత పుట్టింటివారు, అత్తింటివారూ రామరావణ యుద్ధాలు చేసుకుని పిల్లల్ని పట్టించుకొన్న పాపాన పోలేదు. ఫలితం! తామిద్దరూ నూటయాభై రూపాయల జీతంతో సొంతంగా ఒక ఇరుకు గదిలో కాపురం ప్రారంభించారు. ఎప్పుడూ డబ్బు యిబ్బందులూ, అనారోగ్యాలు, పురుళ్ళు, చంటి పిల్లలూ తామిద్దరికీ పెళ్ళయిన తొలి రోజుల జ్ఞాపకాలన్నీ చేదు జ్ఞాపకాలే.

నెమ్మదిగా కోలుకున్నారు. కాస్త జీతాలు పెరిగాయి. వసతులేర్పడ్డాయి. పిల్లలు పెద్దవారయ్యారు. మొదటిది ఆడపిల్ల.

అయిదేళ్ళ క్రితం మూర్తికి ప్రమోషనొచ్చి ఈ క్వార్టరు యివ్వడం వల్ల, ఇల్లు, అందం, మంచాలు, టూ–ఇన్ వన్లూ, టీవీలు అన్నీ ఒక్కొక్కటీ కదలివచ్చాయి.

అయితే అప్పటికే ఈడొచ్చిన ఆడపిల్ల యింట్లో వుండడం వల్ల తామిద్దరూ ఎప్పుడూ బాధ్యతల గురించి ఆలోచించటమేగానీ తమ వయసు, తమ సుఖం, తమ ప్రయివసీ అనే ఆలోచనే వారికొచ్చేది కాదు.

సీత ఆలోచనల్లోంచి ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చింది. చకచకా ఇల్లంతా సర్దేసింది. ముఖ్యంగా తమ గది అత్యంత శుభ్రంగా, అందంగా తీర్చిదిద్దింది. స్వీట్లు, పూలు, పళ్ళు, పాలనురుగుల దుప్పట్లు, పరువాలు పండించే తాంబూలం మనసుదూదిపింజలా తేలికగా గాలిలో ఎగిరిపోతోంది.

షాంపూతో తలారా స్నానం చేసి, చక్కని బట్టలేసుకుని ఫ్యానుకింద కుర్చీలో తలారపెట్టుకుంటూ కూర్చుంది. ఇంట్లో అడుగుపెట్టిన మూర్తి సీతని చూసి ఆశ్చర్యంలో మునిగిపోయారు. 'అగ్నిపునీత సీత' అన్నట్లామె మెరిసిపోతోంది. తుమ్మెద రెక్కల్లాంటి ఆమె కురులు అల్లరిగా ఎగురుతున్నాయి. తాను తెచ్చిన ఒత్తైన జాజిపూల దండతో ఆమె కురుల్ని బంధించాడతను. ఆమె దేవలోకం నుంచి దిగి వచ్చిన ఊహా సుందరిలా వుంది. మాటలు మరచిన వాడిలా మంత్రించిన వాడిలా నిలబడిపోయాడు.

సీత అందంగా నవ్వుతూ భర్తకి స్వాగతం పలికింది. నిజానికి యిద్దరి మధ్యా మాటలులేవు. మాటలకందని ఎన్నో మధుర భావాలు వారి మధ్య మంతనాలాడేసు కుంటున్నాయి. చౌకబారు శృంగార చేష్టలకి వారి మధ్య తావేలేదు. పాతిక సంవత్సరాల సాంగత్యంలో ప్రేమానురాగాలు ప్రోదు చేసుకుని మొలిచిన దివ్య పారిజాత వృక్షం వారి కలయిక. అది పుష్పించబోయే సౌగంధీ పుష్పాలు వారికి ఒక జీవిత కాలానికి పరిమళాన్ని వదిలపరుస్తాయి.

బయట వెన్నెల కాస్తోందో లేదో యిద్దరికీ తెలీదుగానీ వారి మనస్సులో పున్నమి కాస్తోంది. సీతకి తను పదహారేళ్ళ పడుచుపిల్లగా వున్నప్పుడు పాడుకుని పరవశించిన-

పైన వెన్నెలా
మనసు నిండా వెన్నెలా
పైనా - లోనా చందమామా
పరచే వెన్నెలా - ఈ
పాలా వెన్నెలా-

అన్న కృష్ణశాస్త్రిగారి పాట మళ్ళీ ఈనాడు పెదవులపై పారాడింది.

"సీతా! ఈ రోజెంత ఆనందంగా వుందో తెలుసా" అన్నాడు మూర్తి ఆప్యాయంగా ఆమెని దగ్గరకి తీసుకుంటూ.

సీత గువ్వపిట్టలా అతని గుండెల్లో ఒదిగిపోయి "నాకూనూ" అంది పరవశంగా. అప్పుడామె కళ్ళల్లోంచి కన్నీరు రెప్పల్ని పలుచగా తడిపి అతని గుండెల్ని తాకింది.

"సీతా" అన్నాడతను కంగారుగా.

"ఏమీ లేదు - ఇరవై మూడేళ్ళ క్రితం నా కళ్ళు వర్షించిన దుఃఖాశ్రువులు కావివి. ఇవి....ఇవి... ఇన్నాళ్ళకి మన జీవితంలో కురిసిన పన్నీటి జల్లులు" అంది.

రాగం, భావం ఒక జంటైతే నింగి నేలను ముద్దాడుతుంది ఇద్దరు స్త్రీ పురుషులు ఒకరియందు ఒకరు అనురాగం, స్నేహం ఆకర్షణతో ముప్పిరిగొన్నప్పుడు వారు శారీరకంగా ఎంతో దగ్గరవాలని పరితపిస్తారు. అప్పటి ఆ కలయిక అపురూప వరం.

పాతికేళ్ళకి ఒకే ఒక పుష్పాన్ని పూస్తుంది నీలగిరుల్లో కురండి వృక్షం. ఆ పువ్వు పరిమళం పాతిక సంవత్సరాలుంటుంది.

ఆ క్షణంలో సీతా, మూర్తి ఇద్దరు కారు. అన్ని విధాల వారిద్దరూ ఒకటే.

అప్పుడా పాన్పు మీద ప్రేమైకమూర్తి అర్ధనారీశ్వరుని అద్భుత భంగిమ ఒకటి అమరినట్లుంది.

బాహ్య ప్రపంచానికి వారికీ మధ్య కదిలే కాలం తెగిపోయింది.

వారికి సమయమెంతైందో తెలుసుకోవాల్సిన పని లేదు. కాలానికి వారిని పట్టించుకోవాల్సిన అవసరమూ లేదు.

❖ ❖ ❖

సీతకి మెలకువ వచ్చేసరికి తెల్లవారింది. ఒక్కసారి ఏవో స్వర్గలోకాల్లోంచి, వెన్నెల మెట్ల మీంచి భూలోకంలోకి వచ్చినట్లు కళ్ళు తెరిచింది.

బయట కాలింగ్ బెల్ మోగింది. నెమ్మదిగా లేచి దుస్తులు సరిచేసుకుంది. జుట్టు ముడేసుకుంది. వెళ్ళి తలుపు తీసింది. కలకల్లాడుతూ శైలజ. ఆమె పక్కన అల్లుడు ఆశ్చర్యంగా వారినే చూసింది సీత.

"మేం వచ్చేశాం" అంది శైలజ ఉషారుగా.

"రండి. రండి" అంటూ లోపలికాహ్వానించింది అల్లుడూ, కూతురూ ముఖాలు కడిగి కాఫీ తాగే లోపల భర్తను నిద్రలేపి ఆ గది మామూలుగా సర్దేసింది.

పనిలో పడిపోయిన తల్లి వెంటవెంట తిరుగుతూ శైలజ కబుర్లు చెప్పేస్తోంది.

"ఆయనకి ఎల్లుండి నుండి ఢిల్లీలో ట్రెనింగ్ వుందమ్మా. ఆరు వారాలు చాలా సడన్‌గా వచ్చింది. ఈ రాత్రి 'తమిళనాడు'లో ఆయన వెళ్ళిపోతారు. రిజర్వేషను కూడా అయిపోయింది"

సీత ఆనందంగా వింటోంది.

"మనం నెలాపదిహేనురోజులు యిక్కడే" అంది శైలజ నాటకీయంగా.

సీత కూతుర్ని చూసి మురిసింది. ఇరవై మూడేళ్ళు వెనక్కి వెళ్ళిన ఆమె మనసూ, వయసూ మళ్ళీ ఇప్పుడిప్పుడే మామూలు స్థితికి చేరుకుంటున్నాయి. అయితే ఆ తిరిగి వచ్చిన వయసూ, మనసూ, కొత్త ఊపిరి పోసుకుని కళ్ళలో కలకల్లాడుతున్నాయి.

(స్వాతి, 23.2.1990)